పరాజితులు

నర్సు అతని పల్సుచూసి,

రెండుమాత్రలు జాన్సగ్లాస్‌లో మందూ పట్టుకుని, అతనివేపు తిరిగి, 'ఉదయం మందు తీసుకున్నారా?' అంది.

'ఎందుకు మీకనుమానం వొచ్చింది?' అని అడిగేడు శేఖర్ సగం లేచి కూర్చుంటూ.

'ఆ సీసాలు చూసి... ఈపాటికి సగం పూర్తికావలసింది... అలాగే ఉన్నాయని పించింది.'

శేఖర్ నీరసంగానవ్వి, జేతులు కట్టుకుని, కూర్చున్నాడు.

'ఏం?' అంది నర్సు.

'లేదు' అన్నాడు శేఖర్.

'నేను ఈమాట డాక్టరుకి చెప్పాను—' అంది నర్సు మాత్రలు అందిస్తూ.

'నాకు మందులు వేసుకోవాలని లేదు!' అన్నాడు శేఖర్, ఆమె రెండు చేతుల్లోనూ ఉన్న మందుల్ని చూస్తూ.

'ప్లీజ్! మీరంత చిన్నపిల్లలు కాదు, నిజానికి వాళ్లే నయం — భయంతోనో, ప్రేమవల్లనో, నేను చెప్పినట్టు వింటారు! కమాన్!'

నర్స్ అతనితల వెనక చెయ్యిపెట్టితల ఎత్తి నోటిలో మాత్రలు పడేసి మందు తాగించి నేప్‌కిన్ ఇచ్చింది. ఏం జరుగుతోందో అతని కర్థమయేలోపున అతను మందుతాగడం అయిపోయింది.

కోపం, ఆశ్చర్యం కలిసిన గొంతుకతో, 'నేను చిన్న పిల్లవాడినేంకాదు!' అన్నాడు శేఖర్.

చిరునవ్వుతో, 'అందరూ ఎప్పుడేనా ఒక్కొక్కసారి చిన్నపిల్లలే అవుతూంటారు...' అంది నర్స్, రూములో అన్నీ సరీగా సర్దుతూ.

'కాని...మీరు ఇక్కడ కొత్తలాగ ఉన్నారు!'

'అవును...ఈ ఫ్లోర్‌కి ఈ నెల రావడం ఇదే'

'అందుకే చూడలేదు కాబోలు'

'అవును...మరేమైనా కావాలా?'

'ఏమీవొద్దు — ఈమందులు తాగించకుండా ఉంటే చాలును!'

అతని పక్కబట్టలు సర్దుతూ, 'మరిమీకు నయం అవడం ఎలాగ?' అంది నర్స్.

'నాకు నయం కానక్కరలేదు...ఏమైనా ఫరవాలేదు.'

'మరి ఇక్కడికెందుకొచ్చారు? మీకు సర్వీస్ బ్రేక్‌డౌన్ ఎందుకు వొచ్చింది?'

'అదేమీ నాకు తెలీదు...ఇక్కడికి రావాలని నాకు లేదు... మీకు తెలుసుకదా ... ఎవరి బలవంతానవైనా ఇష్టం లేని పనులుచేస్తూ ఉంటాము. నేనిక్కడికి రావడము అలాటి కారణమే ..'

వాచీ చూసుకుని, 'మీరిక్కడ ఉన్నంత సేపూ మావిధి మేము నిర్వర్తించక తప్పదు కదా!...మరోగంటలో విజిటర్స్ వొస్తారు — బట్టలు మార్చుకోండి. నేను డాక్టర్‌ని చూస్తాను' అంది నర్స్.

ఆమె వెళ్లబోతోంటే క్రిందకి దిగి నిలబడి శేఖర్, 'డాక్టరుతో ఏం చెప్తారు?' అన్నాడు.

'నర్స్‌లని గురించి—వాళ్లు రిపోర్ట్‌చేసి ఉంటే సరే, లేకపోతే...'

లేకపోతే?'

'ఆయన చూసుకుంటారు. ఇక్కడ డ్యూటీ విషయంలో చాలా ఖచ్చితంగా ఉంటారు.'

'నేను అబద్ధంచెప్పి వాళ్లమీదకి రాకుండా చూస్తాను.'

నర్స్ నవ్వింది. 'ప్రయత్నించండి... కాని, లాభం ఉండదు. నా సంగతి వీళ్లందరికీ పన్నెండేళ్లనుంచి తెలుసును ... మీ సంగతీ తెలిసే ఉంటుంది!' అని, ఆమె వెళ్లిపోయింది.

శేఖర్ చికాకుగా అటూ ఇటూ పచారు చేశాడు— తనకి మందులు తీసుకోవాలని లేదు. తనకి త్వరగా నయం కాకపోతే బాధ లేదు. అసలు నయం కాకపోయినా విచారం

ఏమీలేదు. చాలాకాలం జీవించాలనీ, ఆరోగ్యంగా ఉండాలనీ; తనకే కోరికలూ లేవు.

వీళ్లు తననెందుకిలాగ బాధపెడతారు?

నర్సు చేతిలో తాను ఓడిపోయాడు.

మిగిలినవాళ్లు ఇంత అన్యాయంగా లేరు... 'తరువాత' తీసుకుంటానంటే కాదనలేరు.

అసలు తానిక్కడికి రాకుండా ఉండ వలసింది...

కంపెనీవాళ్లెంత బలవంతం చేసినా, కాదనే శక్తి ఉండి, సంవత్సరం గడిపాడు. తన పనిలో పెద్ద లోపాలు ఏవీ లేక పోవడంతో డైరెక్టర్లుకూడా ఏమీ అనలేక పోయారు. తనవల్ల కంపెనీకి ఎంత లాభమో, వాళ్లకే తెలుసును ... అందుకే, తాను బాగానే ఉన్నాననిచెప్పి వాళ్ల సూచనలని గౌరవంగానే తిరస్కరించగలిగాడు తాను.

కాని, శాంతిని కాదనలేక పోయాడు.

ఎందుకో, ఆమె తన జీవితంలో ఎవరికీ ఇవ్వకూడదను కున్న స్థానాన్ని ఆక్రమించగలిగింది. అది తాత్కాలికమే. ఒకరోజు—అనుకోని పరిస్థితుల్లో ఆమెకి తాను వాగ్దానం చెయ్యడం జరిగింది.

మాట తప్పడం తనకిపడదు...

ఆమె ఇప్పుడు తనకేమీకాదు—కాని, డాక్టరు వెళ్ల మనేదాకా తానిక్కడ ఉండి వాగ్దానం నిలుపుకోవాలి.

శాంతి...

ఒకప్పుడు తాను ఆమెని ప్రేమించాడు.

జీవితంలో ఇంకెవ్వరినీ ప్రేమించకూడ దని నిర్ణయించుకున్నాక, రాగబంధాలకి కాలం దాటిపోయాక, తాను ఆమెకి చాలా దగ్గర అయాడు. ఆమెకూడా తనకి దగ్గరగా వొచ్చింది.

ఆమెని కలుసుకున్నరోజు, తొలిసారి ఆమెతో మాట్లాడినరోజు, తనకి జ్ఞాపకం ఉంది. అప్పుడు అప్పుడూ ఆరోజు తన జీవింతలో ఉండి ఉండకపోతే, ఒకదారిలో సాగిపోతోన్న తన జీవితం మరోదారి పట్టి ఉండేదికాదనీ, ఈ గతుకులదారి తనకి మరి కొంచెం అశాంతిని కలుగజేసి ఉండేదికాదనీ అతనికి అనిపిస్తూ ఉంటుంది. ఆ పశ్చాత్తాపమే ఆ జ్ఞాపకాన్ని చెరిగిపోకుండా ఉంచింది.

కమల్ ఎందుకారోజు పార్టీ ఇచ్చేడు?

కమల్ పార్టీ ఇచ్చేందుకు కారణం దేనికి? అతనికి బుద్ధి పుడితేసరి...పార్టీకి ప్రతీనెలలోనూ కనీసం ఒకటి, తరుచు రెండు.

ఆ పార్టీలలో గెస్టులెవరు మారినా మారనిది శేఖర్... ఇప్పుడు ఈ నర్సింగ్ హోమ్‌లో ఉండి ఆలోచించిచూస్తే, ఆ రాత్రులూ, ఆ రొదా, ఆ దీపాలూ, తెరమీద బొమ్మలలాగ కనిపిస్తాయి-అవాస్తవంగా. కాని అప్పుడు అవి చాలా వాస్తవాలు.

సంవత్సరం అయింది ఆ పార్టీ అయి.

తాను ఆరోజు మరీ చిరాగ్గా ఉన్నాడు. ఎందుకో! ఏదో చిన్న విషయమే అయి ఉంటుంది. ప్రతీ విషయానికి. కోపం తెచ్చుకోవడం, బాధపడడం, తనకి చాలా కాలంనుంచి అలవాటయిపోయింది...అలాటిదే, మరునాటికి జ్ఞాపకమే ఉండ నిది ఏదో జరిగింది...

వొచ్చిన గెస్టులు తనని పలకరించినా శేఖర్ ముఖంలో చిరాకు తప్ప మరేమి కనిపించక మొదటి గంటలోనే సుమారు అందరూ అతన్ని తప్పించుకుని తిరిగారు. శేఖర్ మామూలు కన్నా ఎక్కువ తాగడం జరిగింది.

కమల్ అతను కూర్చున్న చోటికివచ్చి, అతని పక్కన కూర్చుని, 'ఏమిటి విశేషం, బ్రదర్? అలాగ ఉన్నావేం?' అన్నాడు, మరొక గంటతరవాత.

'ఎలాగ ఉన్నాను?'

'లోకం అంతా నీ శత్రువుల్లాగ...'

'అది నిజమేకనక!'

'కాదని నీకు తెలుసు...'

'నాకు చాలా తెలుసులే-పో కమల్...నీ పనిచూసుకో. నాకు మరో డ్రింక్ ఇమ్మనీ అందులో సోడావొద్దనీ చెప్పు...

'శేఖర్!...నువ్వు కొంచెం స్లో అవు...'

'ఏం? నీ విస్కీ అయిపోతుందా?'

కమల్ నవ్వి, 'నువ్వీ స్పీడుతో సాగిస్తే నిజంగానే అయిపోయేలాగ ఉంది!...కొంచెం తిను ఏమైన...' అన్నాడు. శేఖర్ అతనిమీద చిరాకుపడ్డాడు.

కమల్ పక్కన నిలబడి తనని పరిశీలిస్తూన్న అపరిచితుడెవరో అనవసరంగా కలుగజేసుకోకపోతే, ఆమాటలు మరే ఫలితాలకీ దారితీసేవికావు. కాని అతను కమల్ భుజాలమీదికి వొంగి, 'కమల్! ఈ ఇల్లు నీదా? కాదా?' అన్నాడు.

'ఏం?' అన్నాడు-గొంతుకలో కోపంవిని కమల్.

'ఈయన శాంతిని ఇన్సల్ట్ చేశాడు...'

'ఏమయింది?'

'శాంతి అతన్ని పలకరిస్తే, కసిరాడు...స్నాక్స్ ఆఫర్ చేస్తే క్రిందని పడేశాడు...'

శేఖర్ కి ఒక్కసారి తెలివి వొచ్చినట్లయింది.

కమల్ అతనివైపు ఆశ్చర్యంగా చూసి, 'శేఖర్! నిజమేనా!' అన్నాడు.

శేఖర్ కి జ్ఞాపకంలేదు. అలాటిపని ఏపరిస్థితుల్లో కూడా జరిగి ఉంటుందనీ, తన ప్రవర్తన అంత కిందకి దిగజారి ఉంటుందనీ అతననుకోలేదు చూచాయగా ఆ అపరిచితుడు అరగంట క్రిందట, నాలుగు డ్రింకులకి పూర్వం తన డ్రాగుడు గురించి ఏదో అనడం. తానతనిని 'షటప్' అని చెప్పడం మాత్రం అతనికి జ్ఞాపకం ఉంది.

'అదేం నిజం కాదు కమల్!... ఈమనిషికి అనవసర ప్రసంగం ఎక్కువ అని నేననడం, నోరు మూసుకోమనడం మాత్రం నిజం' అన్నాడు శేఖర్.

కమల్ వెంటనే ఏమీ అనలేదు-అనలేకపోయి, శేఖర్ తన గ్లాసులో మిగిలిన కొద్ది పానీయాన్ని గమనిస్తూ జరిగిన దాన్ని జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

చివరికి కమల్, అవతలి మనిషిని చూస్తూ, షా! నువ్వు చెప్పేది నిజమా?... శేఖర్‌ని నాకు బాగా తెలుసును-అలాగ చేసి ఉంటాడని అనుకోను' అన్నాడు.

షా కోపంగా, 'అతనిసంగతి నీకు తెలీదులే-తెలిసినా ఒప్పుకోవు...అతను ఒక-' అని కోపంగా ఆగి, తాను క్షమించ లేని మాట అన్నాడు.

చేతిలోని గ్లాసు బలంగా విసిరాడు శేఖర్.

అది వెళ్లి రెండడుగుల అవతల నిలబడి అదంతా గమని స్తోన్న శాంతిమీద పడింది.

హాలులో అంతా ఒక్కసారి నిశ్శబ్దం ఆక్రమించింది.

శేఖర్‌కి పూర్తిగా తెలివి వొచ్చింది.

క్షమించరాని తప్పు చేసిన గుర్తింపు తాగిన విస్కీని ఓడించింది.

లేచి, ఊగుతూన్న కాళ్లమీద నిలబడి, 'అయామ్ సారీ' అని, బయటికి వెళ్లడానికి రెండడుగులు వేసి పడబో యాడు.

ఇద్దరు రెండువేపులా అతన్ని పడకుండా పట్టుకుని, మెట్లుమీంచి మీదికి బెడ్ రూమ్‌కి తీసుకెళ్లేరు.

చీకటి గదిలో దీపం వెయ్యగానే కళ్లు అప్పుడే కనిపించినట్టు ఆ ఇద్దరిని చూశాడు-ఒకరు కమల్. రెండోమనిషి శాంతి.

కమల్ అతన్ని మంచంమీద కూర్చోబెట్టి, 'శాంతీ! మీరితన్ని క్షమించాలి....' అన్నాడు.

శాంతి ఏదో అనబోయేలోపున గది తలుపులు విసురుగా తోసుకుని షా లోపలికి వొచ్చి 'శాంతీ! నువ్విక్కడ ఏం చేస్తున్నావు? జరిగినది చాలదా?' అన్నాడు, పెద్ద గొంతుకతో.

'నువ్వు వెళ్లు...' అంది శాంతి.

'నువ్వి ఇంట్లోనే ఉండకూడదు...ఈ గదిలో—'

అతి మెత్తటి శాంతి కంఠస్వరం ఒక్కసారి మారిపోయింది. 'నేనేం చెయ్యాలో, ఎక్కడ ఉండాలో నాకు తెలుసు...నువ్విక్కడినించి వెళ్లు' అంది. అనవసరమైన ఆ కాఠిన్యం శేఖర్‌కి చాలా ఆశ్చర్యం కలిగించింది.

ఉరిమినట్లు అందరివైపూ చూసి షా వెళ్లిపోయాడు. కమల్ ఎయిర్ కండిషనర్ స్టార్ట్ చేసి, శాంతిని కూర్చోమని, సర్వెంటుని పిలిచి, సాక్సూ, బ్లాక్ కాఫీ తెమ్మని చెప్పి, బయటికి వెళ్లేడు.

శేఖర్ పరుపుమీద నీరసంగా జారి, 'శాంతీ! రెండుసార్లు మీకు కష్టం కలిగించాను...ఒకసారా? రెండుసార్లా' అన్నాడు.

'రెండుసార్లే...'

'షా చెప్పినది నిజమే నన్నమాట!'

'అవును...'

'మీకెలాగ క్షమాపణ చెప్పేది?.. ఏ పరిస్థితిలోనూ ఇంత అనాగరికంగా ప్రవర్తిస్తాననుకోలేదు...' అన్నాడు తడబడుతూ.

ఆమె చీరా, బ్లవుజూ తడిసి ఉన్నాయి. ఆ సంగతి గమనించి మరీ సిగ్గుపడ్డాడు శేఖర్.

శాంతి ఏమీ అనలేదు. లేచి అతని టై విప్పి అటు పడేసి, తువ్వాలుతో ముఖంనిండా, మెడలనిండా ఉన్న చెమట తుడిచి, 'ఎలాగ ఉంది?...సాయంత్రంనించీ మీరు మామూలుగా లేరని గమనించాను' అంది.

'భరించలేని సిగ్గుగా ఉంది...మీరు నాబాధని ఈ పరిచర్యలతో ఎక్కువ చేస్తున్నారు...కనీసం నన్ను నాలుగు తిడితే కొంత నయంగా ఉంటుంది' అన్నాడు తాను.

శాంతి చిరునవ్వుతో, 'మిమ్మల్ని తిట్టాలని లేదు-కాని, మీరు అనవసరంగా బాధపడకండి...అందరమూ ఏదో ఒక రోజున ఇలాటి పరిస్థితుల్లో పడేవాళ్లమే!' అంది.

సర్వెంట్ కాఫీ, కొన్ని తినుబండారాలు తెచ్చేడు.

అతనికేదీ తినాలనీ తాగాలనీ లేదు. కాని శాంతి బలవంతాన కాఫీ చాలా తాగాడు. బ్లాక్ కాఫీ.

విస్కీ ప్రభావం తగ్గేసరికి మరోగంట పట్టింది. అప్పటికి పార్టీ ముగిసి అందరూ వెళ్లేరు. శాంతి అతన్ని ఇంటిలో విడిచి వెళ్లిపోయింది.

ఆ తరవాత ఆమెని తప్పించుకుని తిరిగేడు శేఖర్... పార్టీలకి వెళ్లడమే కాక, తాగడం కూడా చాలావరకు తగ్గించేశాడు. ఆరోజు సంఘటన జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా అతను సిగ్గుతో కుచించుకుపోయేవాడు.

నాలుగైదు వారాల తరవాత ఒకనాడు శాంతి టెలిఫోన్ చేసింది...ఆమె బర్త్‌డేకి పార్టీ ఇస్తోంది. నలుగురైదుగురు మాత్రం వొస్తారు. టీకి రావాలి తాను...

'సారీ శాంతి...క్షమించాలి' అన్నాడు తాను.

'మనం ఇద్దరం క్షమాపణలతో కాలం గడిపేలాగ ఉన్నాము-ఈ మధ్య మీరెక్కడికి పోనేలేదు గదా! రండి...నాకు చాలాసంతోషంగా ఉంటుంది' అంది శాంతి.

తనకి వెళ్లాలని లేదు. ఆమాట మళ్లీ చెప్పి, 'రాత్రి నాతో డిన్నర్‌కిరండి...ప్లీజ్!' అన్నాడు.

శాంతి ఒక్కనిమిషం ఆగి, 'సరే!...' అంది.

'ఎనిమిదిగాటగానే వొస్తాను'

'థాంక్స్...' అని ఫోను పెట్టేసింది శాంతి.

ఆ రాత్రి ఇంటికి చేరేసరికి పన్నెండు దాటింది-డిన్నర్ తరవాత మెరీన్ డ్రైవ్‌లో తిరిగీ, కొంతసేపు కూర్చునీ.

తానిచ్చిన నెక్లెస్ తీసుకోడానికి శాంతి ముందు ఒప్పుకోలేదు. ఆమె చివరికి అంగీకరించేసరికి తనకి ఎంతో సంతోషం అనిపించింది.

ఆ పరిచయం క్రమంగా రోజు కలుసుకొనేదాకా వొచ్చింది-ఆమె ఒక్కరోజు కనిపించకపోతే తహతహ లాడిపోయే వాడు తాను. ఆమెమీది అభిమానం క్రమంగా ప్రేమగా మారడం తనకి ఆశ్చర్యం కలిగించనూ లేదు. కాని, శాశ్వతంగా ఆమె తనదిఅయితే, ఆమెకి శాంతి ఉండదు-పేరులో తప్ప, అని తనకి తెలుసును.

దానికి కారణం-తన చరిత్రా, తన మనస్తత్వమూను. పుట్టుకనించి తనలో విచిత్రమైన ఒక గుణం ఉండేది-అది కారణం లేకుండానే ఎవరినైనా ద్వేషించ గలగడం.

తనకి జ్ఞానంవొచ్చిన దగ్గరినించి ఈ గుణం తనని ఆశ్చర్యపరుస్తూనే ఉంది; అది సహజంకాదనీ. వాంఛనీయంకాదనీ తనకి తెలుసును. కాని, కొంతమందిని చూడగానే, వారితో రెండు మాటలాడ కుండానే వారిమీద తనకి ద్వేషం కలిగేది. మరీ చిన్నప్పుడు ఈద్వేషం తక్షణమూ అవతలి పిల్లలమీద (ఒక్కొక్కప్పుడు పెద్దవాళ్లమీద) చెయ్యిచేసుకునేలాగ చేసేది, పెరిగినకొద్దీ ఈ ద్వేషాన్ని కొంత తగ్గించుకుని దైనందిన జీవితాన్ని గడుపుతూ వచ్చాడు. కాని, ఆగుణం తనలో ఎప్పటికీ పూర్తిగా నశించలేదు.

ఆ తత్వమే తనని సంసారానికి అనర్హుడిగా చేసింది. ఎంత మంచిదైనా, ఎంత సహనంగలదైనా, ఏ ఆడదీ తనలో

ఉన్న ఈ గుణాన్ని భరించలేదు. ఎప్పుడో ఒకప్పుడు, విధిగా ఆమె తనచేతిలో బాధపడుతుంది. జరిగేదంతా తనచేతిలోనూ ఉండదు...తనకతీతమైన ఏదో శక్తి తనలోని మానవతని హటాత్తుగా మాయంచేసి, తన స్థానంలో ఒక దానవుణ్ని ఉంచుతుంది తాను నిస్సహాయంగా, వాడు ఎక్కడనించి వొచ్చాడో అక్కడికి వెళ్లేదాకా, వేచి ఉండడం కన్న ఏమీ చెయ్యలేడు.

ఆమెని పెళ్లిచేసుకుని సుఖపడదామనే అనుకున్నాడు తాను. అంతకుముందు ఆడ వాళ్లతో తన పరిచయాలు ద్వేషంతోనే అంతమయిఉన్నా వాళ్లు అందరూ తనకి అప్తులుకారు. మానసికంగా వాళ్లు తనకి దగ్గరకాదు కూడాను. వాళ్ల స్వార్థం కోసం తన స్వార్థాన్ని వాళ్లు సంతృప్తి పరచారు.

గీత అలాగ కాదు.

ఆమెతో పరిచయం అయాక ఆమెని పెళ్లి చేసుకుందామని తాను మనసారా కోరాడు.

అందరిలాగానే, ఆమెతో తాను తిరిగి, యవ్వనంలో సహజమైన ఆనందాన్ని ఆమెతో పంచుకున్నాడు. ఆమెచుట్టా లెవరో హటాత్తుగా పోయిఉండడాన్న కాని, త్వరగా ఆమె వివాహం చేసుకుని ఉండేవాడు,

మరొక ఆరునెలలు గడువుపడింది వివాహం.

ఆ ఆరు నెలలలోనూ మూడు బాగానే గడిచాయి.

ఆ తరువాత...

ఆ సాయంత్రం మళ్లీ జ్ఞాపకం చేసుకోవాలనిపించ లేదు శేఖర్ కి. అయినా, అతనికి వివరాలు ముందునించీ తెలీవు.

అతనికి జ్ఞాపకం ఆమెని ఆ సాయత్రం గేలార్డ్ లో కలుసుకోడానికి ఆరునించీ ఎదురు చూసి, ఆరున్నరకి ఆమె రాగానే. ఆమెని దూషించడం: ఆమె కన్నీళ్లతో ఏదో అన బోతే ఆమెని లెంపమీద కొట్టండం.

దానితో ఆ సంబంధం రద్దుఅయి పోయింది.

తానూ రద్దుఅయాడు-చాలా మందికి. కోర్టుకేసులో తాను 'గిల్టీ' ప్లీడ్ చేసి రెండువొందల రూపాయిల జుల్మానా కట్టాడు.

తరవాత......

తరవాత అమిత: ఆమెతోనూపోట్లాట—

* * *

శేఖర్ బలవంతంగా ఆలోచనలని ప్రస్తుతానికి తెచ్చు కున్నాడు. జరిగిన వన్నీ జ్ఞాపకాలుగా తనకి కలిగించేది బాధ కన్నా మరేమీ లేదుగా! 'పునరపి మరణం' అనినట్టు, సంయోగం, తన చేతులలో ఆ సంబంధానికి వినాశం వియోగం. అంతే.

శాంతి...

తనని బలవంత పెట్టి ఇక్కడ పెట్టింది.

పదిహేనురోజుల క్రిందట,

ఆమెమీద తనకి ఆప్యాయత హెచ్చయిన కొద్దీ, అది ప్రేమగా మారినకొద్దీ తనకి బెంగగానే ఉంది—తనలోని దానవుడు బయటికి వొస్తాడేమోనని.

కాని, ఇప్పటిదాకా అవాంఛనీయమైన దేమీ జరగలేదు ...నెలరోజుల క్రిందట హఠాత్తుగా తనకి జీవితంమీద కోరిక చావటం తప్ప.

అదే శాంతిమీద ఉదాసీనతని కలుగ జేసింది. అన్ని విషయాలమీద అసహ్యం కలుగజేసింది.

చావాలనిలేదు తనకి.

కాని, బ్రతకాలని లేదు.

సంపూర్ణమైన ఉదాసీనత.

శాంతిని చూడాలనిలేక ఆమెని కలవడం మానేశాడు. ఆమె తనని వెతుక్కుంటూ వొస్తే, కనిపించకుండా ఉండి పోయాడు. ఆరునెలలై ఆమె ప్రార్థనకి లొంగి తాగడం మానినా, మళ్లీ తాగుడు మీద విపరీతమైన కోరిక.

ఇంత ఉదాసీనతలోనూ ఆ కోరికని అదుపులో పెట్టు కున్నాడు.

చివరికామె తనని వేటాడి పట్టుకుని ఇక్కడ చేర్చింది— మొదటి పదిరోజులూ నాలుగునుంచి ఆరుదాకా ఉన్న విజిటింగ్ అవర్స్ పూర్తిగా ఇక్కడ గడిపింది...తాను ముభావంగా ఏదో ఒకటిరెండు మాటలాడడం కన్నా చెయ్యకపోయినా,

కొన్ని వారాల క్రిందట తనలో ప్రారంభించిన ఈ ఉదాసీనతకి కారణం అతనికీ తెలీదు — నిజానికి ఆ విషయాన్ని గురించి తరిచి ఆలోచించాలనీ అతనకి లేదు. ఎప్పుడో హఠాత్తుగా తనకి తెలియకుండానే, ఆమెనించి జారిపోయి దూరంగా వెళ్ళిపోవడం ప్రారంభించాడు...అంతే.

ఈ నాలుగు రోజులలో శాంతి ఒక్కరోజు మాత్రం వొచ్చింది-తొలినాడు రాలేనని టెలిఫోన్ చేసింది, ఆఫీసులో ఏదో అర్జెంటుపని కారణంగా. మర్నాడు అయిదయాక వొచ్చి అరగంటలో వెళ్ళిపోయింది. ఉన్న కొంచెంసేపూ ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుని ఆ తరవాత ఆమె రానూ లేదు, ఫోనుగూడా చెయ్యలేదు.

ముందర అతనికి రిలీఫ్ కలిగింది... తనకి అంతగా శాంతి బంధించడం అతనికి ఈ మధ్య చాలా అసంతృప్తి కలుగ జేస్తోంది. మరోవారం తిరగకుండా ఈ నర్సింగ్‌హోమ్ విడిచి వెళ్ళిపోవొచ్చుననీ, తన పూర్వాశ్రమంలోకి మళ్లీ ప్రవేశించి, ఆందోళనలేని జీవితం సాగించవొచ్చునని అతని కనిపించింది. అన్నీ ఆలోచిస్తే, ఈ ప్రేమ ఏమిటి, తాత్కాలిక వ్యామోహం తప్ప? గీతనీ, అమితనీ తాను ఒకప్పుడింత గాఢంగానూ ప్రేమించలేదూ? వాళ్లని ఇప్పుడు మనసారా ద్వేషించ గలగలేదూ?

శాంతిని తాను ద్వేషించడంలేదు.

కాని, మరికొన్ని వారాల్లోనో, నెలల్లోనో, ఆమెనీ ద్వేషించ గలుగుతాడు.

శేఖర్ గడియారం చూసుకున్నాడు... మరో పది నిమిషాలలో నాలుగవుతుంది.

తనకోసం శాంతి తెచ్చిపడేసిన పుస్తకాలలో ఒకటి తీసుకుని కుర్చీలో కూర్చుని చదివే ప్రయత్నం చేశాడు—కాని, అతని మనస్సులో ఏమీ పోవడంలేదు. పుస్తకం కిందనిపడేసి, మళ్లీ గదిలో పచార్లు సాగించాడు.

ఇక్కడినించి త్వరగా వెళ్లిపోవాలి.

శాంతి మళ్లీ కనిపించకూడదు...

ఆమె ఈరోజుకూడా రాకుండా ఉంటే బాగుండును.

అతను మళ్లీ టైము చూశాడు...ఇంకా నాలుగుకి ఆరు నిమిషాలు ఉంది.

అతనికి శాంతినిగురించి ఆలోచించాలని లేదు. కాని ఆమెనిగురించి తప్ప ఆలోచించలేకుండా ఉన్నాడు.

కొద్ది నిమిషాలు శేఖర్ దృష్టినంతనీ టెలిఫోన్ మీద కేంద్రీకరింపజేశాడు. అది తనకి శాంతినించి సందేశం తెస్తే...

అతనెంత తీవ్రంగా టెలిఫోన్ మీద దృష్టినిలిపినా ఏమీ జరగలేదు.

నాలుగయింది.

మరో ఇరవై నిమిషాలతరవాత అయిదు...

ఇంక ఆగలేక అతను ఆమె ఇంటికి టెలిఫోన్ చేశాడు—కాని, ఆమె ఇంకా రాలేదని చెప్పారు...

ఆమె ఆఫీసుకి టెలిఫోన్ చేశాడు—

నాలుగు కాకుండానే ఆమె వెళ్ళిపోయిందని అక్కడ నించి చెప్పేక అతనికి కోపం వొచ్చింది. శాంతి ఎక్కడికి వెళ్ళిపోయింది?

ఆమె వెంటనే వొస్తే బాగుండును...

మళ్లీ గదిలో పచార్లుచెయ్యడం ప్రారంభించాడు శేఖర్.

శాంతి ఎందుకు మారిపోతోంది?

షా జ్ఞాపకం వొచ్చాడు. అతనికి లండన్‌లో పోస్టింగ్ వొచ్చిందని విన్నాడు... కాని శాంతి ఆరాత్రితో అతనితో పూర్తి తెగతెంపులు చేసుకుంది. మరి?

ఎన్నియుగాలో గడిచాక అరయింది.

శాంతి రాలేదు.

నర్సువొచ్చి మందులిచ్చి, డాక్టర్‌ని పిలించింది. డాక్టర్ అతనికి సెడెటివ్ ఇచ్చి నిద్ర పోగొట్టాడు.

ఆ తరువాత నాలుగురోజులూ శేఖర్ చాలా మంచి పేషెంటుగా గడిపాడు... శాంతి ఇంకా రాదని నిర్ణయించు కున్నాక అతనికి కొత్త ప్రశాంతి కలిగింది. అతని దైహిక పరిస్థితి మారి, అతను అడగగానే డాక్టరు డిశ్చార్జి చేశాడు.

ఆఫీసునుంచి కొలీగ్సూ, ఇద్దరు డైరెక్టర్లూ వొచ్చి అతనికి శుభాకాంక్షలు చెప్పి ఇంటికి తీసికెళ్లేరు...అతని ఇంటి దగ్గరే పార్టీ ఏర్పాటు చేశారు.

శేఖర్ తన రెండు డ్రింకులూ అయాక మూడోది గ్లాసులో వేసుకున్నా, తాగలేకపోయాడు...ఫ్రెండ్స్ సంతృప్తిగా అతన్ని హేళన చేశారు.

అందరూ వెళ్లిపోయేసరికి రాత్రి పది అయింది.

అప్పుడతను శాంతికి టెలిఫోన్ చేశాడు-ఈ కథకి అంతం అస్పష్టంగా అవడం ఇష్టంలేక.

అతనికి ఆమె కంఠస్వరం వినిపించగానే, 'శాంతీ! నేను నిన్ను డిస్టర్బ్ చేస్తున్నానా?' అన్నాడు.

శాంతి నవ్వి, 'లేదులే...ఎక్కడినించి?' అంది.

'ఇంటినించి'

'బాగున్నావా?'

'చాలాను...'

'గుడ్...'

ఆ తరవాత ఏమనాలో అతనికి తెలియ లేదు. ఆమెని చాలా ప్రశ్నలు వెయ్యాలని అతననుకున్నాడు. కాని, అవన్నీ అసందర్భాలుగా అనిపించాయి.

నిశ్శబ్దానికి అడ్డువొస్తూ, 'శేఖర్!... ఇక్కడ చాలా మంది ఉన్నారు. కాని, ఒక్కసారి నిన్ను చూడాలి...ఇప్పుడే. వొచ్చేదా?' అంది శాంతి.

అతను ఆలోచనలో పడ్డాడు.

'పదినిమిషాలలో అక్కడ ఉంటాను.

శాంతి టెలిఫోన్ పెట్టేసింది.

ఆమె వొచ్చేసరికి అతని డ్రాయింగ్‌రూమ్ ఇంకా చిందరవందరగానే ఉంది. సిగరెట్ల పీకలతో నిండిన ఆష్‌ట్రేలూ, ఖాళీ గ్లాసులూ అసహ్యంగా కనిపిస్తున్నాయి.

శాంతివొచ్చి సోఫాలోకూర్చుని 'ఈమధ్య నా ప్రవర్తన విచిత్రంగా కనిపించింది కాదూ?' అంది ఉపోద్ఘాతం లేకుండా.

'అవును...'

'కారణం వినాలని ఉందా?

'నీ ఇష్టం...'

'చెప్పాలని ఉంది నాకు...మళ్లీ మనం కలుస్తామని అనుకోకు—చెప్పనీ' అంది.

'చెప్పు' అన్నాడు శేఖర్. అటూ ఇటూ పచార్లుచేస్తూ.

'నాకు ఎరుదుగాకూర్చో... ఇంత కదలిక చూస్తే నెర్వస్‌గా ఉంటుంది నాకు'.

శేఖర్ ఆమె మాట్లాడుతున్న తీరుకి ఆశ్చర్యపడి, ఆమెకి ఎదురుగా కూర్చున్నాడు.

'థాంక్స్... శేఖర్, కమల్ ఇంట్లో పార్టీనాటినుంచి చాలాదూరం వొచ్చేం కాదూ?

అతను జవాబివ్వలేదు.

'ఆరాత్రి నించీ నిన్ను ప్రేమించాను. అదీ నీకు తెలుసును...

'అవును—కాని...'

'అదే చెప్తున్నాను. తరవాత నువ్వు 'ప్రేమలో' పడ్డావు-నీ ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. గౌరవనీయుడవయి పోయావు'

'.........'

'అదే నాకు పడదు శేఖర్-నాది విచిత్ర ప్రవృత్తి అంటే అను. కాని, మెత్తటి మనుషులంటే చీదరించుకుంటాను నేను... దానికి క్షమాపణ చెప్పడంలేదు. నీకు అర్థమౌతుందనుకుంటాను.'

శేఖర్ లేచి నిలబడి, ఆమె కళ్లల్లోకి చూశాడు-అక్కడ మార్దవంగాని, అనురాగం కాని కనిపించలేదు.

శాంతి తన బేగ్ తీసి, ఆనాడతనిచ్చిన నెక్లెస్ తీసి అతనికి ఇచ్చేందుకు చెయ్యి జాపుతూ 'ఇది నాకు వొద్దు శేఖర్... నువ్వే ఉంచుకో' అంది.

'ఇచ్చినవి తిరిగి తీసుకునే లోభం లేదు శాంతీ!... నువ్వే ఉంచుకో' అన్నాడు కోపంగా శేఖర్. అతని కోపం ఆమెమీద కాదు. తన మీదనే.

శాంతి నవ్వి. 'నీకు చాలా ప్రియురాళ్లు ఉన్నారు కదా! ఎవరికైనా ఇయ్యి. నాకు నగలమీద మోజు లేదు' అంది.

'కుదరదు'

శాంతి నెక్లెస్ పెట్టెలో ఉంచి టేబిల్ మీద పెట్టి నిలబడి బయలుదేరుతూ, 'నీ యిష్టం-కాని, అది నాకు పాములాగ కనిపిస్తోంది. నేను ఏ పరిస్థితుల్లోనూ పెట్టుకుని వెళ్లను...గుడ్ బై!' అని, నెమ్మదిగా అడుగులు వేసింది.

శేఖర్ ఆ పెట్టి చేతిలోకి తీసుకుని కోపంగా ఆమె మీదికి విసరబోయాడు.

శాంతి ఒక్కసారి వెనక్కి చూసి, అతని రౌద్రాన్ని గమనించి క్షణమాత్రం నిలబడి, మళ్లీ ముందుకి సాగి, తలుపుతీసి మళ్లీ వెనక్కి చూసింది.

అతను చేతిలో ఆ పెట్టితో అలాగే నిలబడి ఉన్నాడు. వెక్కిరిస్తోన్న ఆమె కళ్లు మరింత కోపోద్రిక్తుడిగా చేశాయి.

అతను పెట్టిని గోడకివేసి కొట్టేడు. నెక్లెస్ బయటికి వొచ్చి, నేలమీద పడింది.

శాంతి ఆశాభంగం చెందినట్టు ఆమె ముఖం చూస్తే తెలిసి ఉండేది... ఆ విసరడం ఆమెమీదికే విసిరితే, ఆ ఆశాభంగం ఉండిఉండేది కాదు.

ఆమె నీరసంగా తలుపువేసి బయటికి వెళ్లిపోయింది.

శేఖర్ ఆ మూసిన తలుపువేపు చూస్తూ చాలాసేపు

నిలబడి. తరవాత సోఫాలో కూర్చుని నెక్లస్ వేపు దృష్టిని మళ్లించాడు.

చివరికి నెమ్మదిగా నెక్లస్ తీసి, డ్రాయిర్ లో పడేసి మరో డ్రింక్ గ్లాసులో వేసుకున్నాడు.

దాని రుచీ చేదుగా ఉంది.

ఓటమిలాగ.